కథా కౌముది

# అంతర్ముఖం

అనిల్ ప్రసాద్ లింగం

"ఏడమ్మా మీ మావయ్యా ?" రామారావు ఇంటి ముందు నుంచుని, పని చేసుకుంటున్న అతని కోడలు అన్నపూర్ణని అడిగాను.

"రాత్రంతా తండ్రీ కొడుకులిద్దరూ బలాదూరు తిరిగి తెల్లారాకొచ్చి పోడుకున్నారండీ. ఇంకా లేవలేదు" తన సహజ ధోరణిలో చెప్పింది ఆమె.

రాత్రి టీవీలో తొమ్మిదింటి వార్తలు అయ్యేంతవరకూ రామారావు నాతోనే ఉన్నాడు. మరి ఆ తరవాత ఎక్కడికి వెళ్ళాడో. ఆమెని అడిగితే సరైన సమాధానం రాదని తెలిసి నేను వెనుదిరిగాను.

★ ★ ★ ★ ★

పోస్టుమాస్టారుగా పని చేసిన నాకు, బదిలీ పై ఈ ఊరు వచ్చిన దగ్గర నుంచీ రామారావుతో పరిచయం. మున్సిపాలిటిలో గుమస్తాగా పనిచేసిన అతను తన పిల్లలు, భార్య పేరున ఉన్నా చిన్న మొత్తాల పొదుపు ఖాతాల జమాపుంజీల విషయంలో ప్రతీనెలా పోస్టు ఆఫీసుకు వచ్చేవాడు. అటుపై నేను అతను ఉండే వీధిలోనే అద్దెకు దిగడంతో మా స్నేహం చిగురించింది. పదవీ విరమణం చేశాక ఇద్దరం ఒకే ప్రాంతంలో జాగాలు కొనుక్కొని ఇల్లు నిర్మించుకున్నాము. ఏడాది తేడాలో ఇద్దరి సహ ధర్మచారిణులూ కాలం చెయ్యడంతో ఇరువురం మా ఒంటరితనాన్ని తప్పించుకోడానికి మరింత దగ్గరయ్యాము.

నా ఒక్కగానొక్క కొడుకు విదేశాలలో ఉండటంతో నేను నా ఇంటిలోని చిన్న వాటాలో ఉంటూ మిగతాది అద్దెకు ఇచ్చేశాను. రామారావుకు ముగ్గురు పిల్లలు. పెద్దకొడుకూ తరవాతి కూతురూ చక్కగా చదువుకొని మంచి ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఆఖరివాడైన రాజేష్ కు చదువు సరిగ్గా అబ్బలేదు. పదవతరగతి తప్పి ఆటో తోలుతూ జీవనం సాగిస్తున్నాడు. ఉన్న ఇంటినీ జతగా తండ్రినీ కలిపి వీడికే వదిలేశారు పెద్దాళ్లిద్దరు.

రాజేష్ స్వతహాగా మంచివాడే, తండ్రిని బాగానే చూసుకుంటాడు. కానీ తన డ్రైవర్ వృత్తి నేపథ్యంలో ధూమ – మద్య పానాలకి అలవాటు పడ్డాడు. పెళ్లి చేస్తే కుదురుకుంటాడని రామారావు తన చెల్లెలి కూతుర్ని కట్టబెట్టాడు. సొంత మేనమామ అనే చనువుతో ఆ అమ్మాయి ఈయన్ని అసలు గౌరవించదు. చాలీచాలని ఆదాయం, ఎప్పుడూ ఏవో ఖర్చులు – వాటిని గురించిన గొడవలు. ఈ సమస్యలన్నింటి నుంచీ సేదదీరడానికి రామారావు నా దగ్గరకొస్తాడు.

ఉదయాన్నే లేచే అలవాటున్న నేను, ఆరింటికల్లా టీ పెట్టేస్తాను. రామారావు కూడా లేచి తన పేపర్ పట్టుకొని మా ఇంటికొచ్చేస్తాడు. ఇద్దరం టీ త్రాగి – తన, నాది రెండు పేపర్లూ పది గంటలవరకూ చదివేస్తాము. అప్పుడు ఇక తను అతనింటికి వెళ్తాడు. పని మనిషి వచ్చి నాకు అల్పాహారం చేసి, బట్టలు ఉతికి, మధ్యాహ్ననికీ – రాత్రికీ కలిపి వంట చేసి వెళుతుంది. సాయంత్రం ఐదుకల్లా మా ఇంటి వీధి అరుగు మీదకు చేరి

పిచ్చాపాటి మాట్లాడుకొని, నచ్చిన ధారావాహికలు చూసి, రాత్రి వార్తలు చూసాక వెళ్ళేవాడు రామారావు. కాస్త అటూ – ఇటూగా గత ఏడాదికాలంగా ఇదే మా దిన చర్య. అలాటిది ఈ రోజు పొద్దున్న తను రాకపోయేప్పటికి ఆరోగ్యం బాగులేదోమోనని అతని ఇంటికి వెళ్లాను.

★ ★ ★ ★ ★

సాయంత్రం వచ్చాడు రామారావు "రాత్రి ఎక్కడికి వెళ్లావు?" ఆత్రంగా అడిగాను.

"మా చిన్నాడు రాత్రి నేను పడుకున్నాక వచ్చి లేపి, బజారులో వినాయక మంటపం దగ్గర హరిశ్చంద్ర నాటకం వేస్తున్నారు, వెళ్దాం రమ్మంటే వెళ్ళాం. వచ్చేటప్పటికి తెల్లారి పోయింది" నిద్ర లేక పీక్కుపోయిన మొహంతో చెప్పాడు రామారావు.

"అవునా ! ఎలా ఉందేంటి నాటకం? ఎవరు ఆడారు?" ఆసక్తిగా అడిగాను

తనలో ఉత్సాహం ఒక్కసారిగా ఉప్పొంగింది. నీరసంగా ఉన్నా కళ్ళల్లో మెరుపులు కనిపిస్తున్నాయి. అన్నీ లబ్ధ ప్రతిష్టుల పేర్లే చెప్పాడు. వాళ్ళు పద్యం పాడిన విధానం, అందుకు నగర ప్రముఖులు సమర్పించిన నజరానాలు, మధ్యలో కొడుకు కొనిపెట్టిన సిగరెట్టు పెట్టె, తాగించిన టీలు అన్నీ వివరంగా చెప్పాడు.

"చాలా రోజులు అయ్యిందయ్యా అలాటి పద్య నాటకం చూసి. మా వాడు కూడా నా కోసం రాత్రంతా ఉండి ఇంటికి తీసుకొచ్చాడు" దగ్గుతున్నా, కొడుకు తనపై చూపిన అభిమానానికి పొంగి పోతున్న ఆ తండ్రి మొహం వెలిగిపోతోంది.

"రాత్రంతా నిద్ర లేదుగా కొంచెం నీరసంగా ఉంది. పెందళ్ళాడ ఒక ముద్ద తిని తొందరగా నిద్ర పోవాలి" అని తన ఇంటికి బయలుదేరి వెళ్ళుతున్న రామారావుని చూస్తూ నా మనసు పరిపరి విధాల ఆలోచింపసాగింది. గత యేడాది కాలంగా మేమిద్దరం ఒకరికొకరం తోడూ నీడగా ఉంటున్నాము. కోడలు పెట్టే వెతలు, కొడుకు తాగివచ్చినప్పుడు చేసే గొడవ, పుట్టింటి తరపున తనకు జరగాల్సిన పెట్టుబడుల గురించి ఫోన్ చేసి మరీ కూతురు పెట్టే ఆరళ్ళు – ఇలా అన్నీ కష్టాలే నాతో చెప్పుకోనే రామారావు మొదటిసారి తన సంతోషాన్ని పంచుకొంటే నాకు జీర్ణం కాలేదు.

నా చెవులు అతని నోట కష్టాలు వినడానికీ, నా నోరు అతనికి సాంత్వన వచనాలు పలకడానికీ అలవాటు పడిపోయాయి. అవి వాటి నైజాన్ని మార్చుకోడానికి మొరాయించి నా మనసు పైనే ప్రభావం చూపడం మొదలు పెట్టాయి. అందుకు కారణం లేకపోలేదు. పద్య నాటకం అంటే నాకెంతో ఇష్టం – ఈ మధ్య అసలు ఆ నాటకాలే జరగడం లేదు. అలాటిది రామారావు రాత్రి నాటకానికి వెళ్తూ నన్ను పిలవలేదు. సొంత ఆటోలో ఒక్కడే వెళ్ళక పోతే నన్నూ తీసుకుపోవచ్చుగా? రోజూ వచ్చి నా దగ్గర తన బాధలు వెళ్ళబోసుకొనే వాడికి, నాటకానికి వెళ్ళేటప్పుడు మాత్రం నేను గుర్తు రాలేదా? నన్ను విస్మరిస్తాడా ? నాకు కోపం హెచ్చింది. ఆ రామారావుకి పాఠం నేర్పాలని నిర్ణయించుకున్నాను.

★ ★ ★

తెల్లారింది. నా మనసు క్రోధంతో నిండి ఉంది. టీ పెట్టాను – ఇద్దరకూ. ఒక కప్పులో పోసుకొని నేను త్రాగాను. ఆరున్నర అయ్యింది – రామారావు రాలేదు. నేను పేపరులో మునిగాను. ఏడయ్యింది – అతను రాలేదు. నాకు వార్తలు రుచించడం లేదు. ఇక లాభం లేదనుకొని మా వీధి గుమ్మం దగ్గరకు నడిచాను. కాస్త దూరంలో అగుపించాడు స్నేహితుడు. అతన్ని చూడగానే మనసు తెలీని ఆవేశంతో రంకెలు వేసింది.

"టీ తాగావా ?" వస్తూనే అడిగాడు.

"ఆ ! అయ్యింది" నేను చెప్పాను.

"నా కప్పూ ?" చనువుగా అడిగాడు తను.

"నువ్వు వస్తావో రావో అని నీకు పెట్టలేదు. రాత్రి నాటకానికి వెళ్ళలేదా ?" ఉక్రోషం వెళ్లగక్కేసాను.

"రోజూ ఎందుకు వెళ్తాం? మొన్నంటే హరిశ్చంద్ర అని వెళ్ళాం" తను వివరణ ఇచ్చాడు.

ఇద్దరం చెరో పేపరుతో కుస్తీ పట్టడం మొదలుపెట్టాక, ఓ పావుగంటకి "నోరు పీక్కుపోతుందయ్యా కొంచెం ఓ కప్పు టీ పెడతావా ?" బ్రతిమళ్ళాడాడు రామారావు.

"పాలు తోడు పెట్టేసాను" అనాయాసంగా అబద్దం ఆడేశాను.

"నేను షర్టు జేబులో డబ్బు వేసుకు రాలేదు. పోనీ కొంచెం చిల్లర ఇవ్వు అలా వెళ్లి హోటల్లో టీ త్రాగివస్తా" అన్నాడు. ఆ మాట నన్ను మరీ రెచ్చ గొట్టింది. ఇద్దరం వెళ్లి తాగొద్దాం అని అనొచ్చుగా...... స్వార్థం.

"నా దగ్గర చిల్లర లేదు. ఈ రోజు ఊరు వెళ్ళే పని ఉంది. నేను బయలుదేరాలి" అంటూ లోనికి నడిచాను. తొట్టిలోని నీరు తోడుకొని స్టవ్ మీదపెట్టి బాత్రూం వైపు నడిచాను. వెనకే వచ్చాడు రామారావు, "ఏ ఊరు? ఏంటి పని ? మళ్లీ ఎప్పుడొస్తావు తిరిగి?" అతని చనువు నాకు ఒళ్ళు మండిస్తుంది.

"బందరు వెళ్ళాలి. రేపొస్తాను" అని బాత్రూం తలుపేసుకున్నాను. కాసేపటి తరవాత అతను వెళ్తున్నానని చెప్పి వెళ్ళిపోయాడు. అప్పుడు నా మనసు కొంత శాంతించింది.

బజారుకెళ్ళి కావాల్సిన సరుకులు కొనుక్కొని, మా పోస్టాఫీసుకు పోయి అక్కడి స్నేహితులతో కాసేపు గడిపి – మధ్యాహ్నం మ్యాట్నీ సినిమా చూసి సాయంత్రానికి ఇల్లు చేరాను. నేను ఉండననుకొని రామారావు మా అరుగు మీదకు రాలేదు. వివిధ పనులతో కాలక్షేపం చేసిన నేను రాత్రికి పని మనిషి చేసి పెట్టిన వంట వడ్డించుకుంటుంటే పక్కన పొద్దున్న నేను పెట్టిన టీ గిన్నె కనపడింది. అందులో కొంచెం టీ మిగిలి ఉండటంతో మళ్లీ వేడి చేసుకు తాగుతానని ఆ పాత్రను పని మనిషి అలానే వదిలేసినట్టుంది. దాని వంక చూశాక నా మనసు వికలమైంది. ఎన్నో ఆలోచనలు నన్ను చుట్టి ముట్టాయి.

మాకు పరిచయమైననాటి నుండీ నేను రామారావూ ఎప్పుడు గొడవపడ లేదు. కనీసం మామధ్య మాట పట్టింపులు కూడా వచ్చిన జ్ఞాపకం లేదు నాకు. ఇక గత ఏడాది కాలంగా అయితే మేమిద్దరం మరీ కలిసి పోయాము. మధ్యలో ఓ మూడు నెలలు నేను నా కొడుకుతో విదేశం వెళ్ళినప్పుడు నా ఇంటిని తానే చూసుకున్నాడు. తిరిగొచ్చాక అక్కడి విశేషాలు, వాతావరణం, పరిస్థితులు, నేను చూసొచ్చిన హాలీవుడ్ స్టూడియో, డిస్నీ ల్యాండ్ వంటి వాటి గురించి చెప్తూ అక్కడ దిగిన ఫోటోలు చూపిస్తే ఎంతో ఆసక్తిగా విన్నాడు తప్పా ఏనాడు తన పిల్లల్ని నా కొడుకుతో పోల్చి అసూయ పడలేదు. అలాటిది నేను అతను ఒక వీధి నాటకం చూడటానికి నన్ను పిలవకుండా వెళ్ళాడని అతని పై ద్వేషం పెంచుకోవడం నాలోని అహాన్ని బయటపెట్టింది. నా తప్పు నాకు తెలిసొచ్చింది. పొద్దుటి నా ప్రవర్తన నాకే సిగ్గనిపించింది. అన్నం సహించలేదు. రేపు రామారావుతో మళ్లీ మామూలుగా కలసిపోవాలని నిర్ణయించుకొని పడుకున్నా.

★ ★ ★ ★

తెల్లారింది, పాలొచ్చాయి, టీ కాగింది – రామారావు రాలేదు. నేను నా కప్పు తాగాను. పేపరొచ్చింది – అతను రాలేదు. ఏదైనా తన జాడలేదు. మనసు ఉండబట్టలేక ఒక గ్లాసులో టీ తీసుకొని వాళ్ళ ఇంటికి బయలుదేరాను. నేను ఇంకా నాలుగడుగులు దూరంలో ఉండగా నన్ను దాటుకొని పోయి వాళ్ళింటి ముందు ఆగింది, అతని కొడుకు ఆటో. అందులో నుంచి రాజేష్ దిగి వచ్చి, నన్ను పట్టుకొని "నాన్న వెళ్ళిపోయాడంకుల్" అని ఘొల్లుమన్నాడు. నమ్మలేక నిశ్చేష్టుడనయ్యి నిలబడిపోయాను. రామారావు పార్థివ దేహాన్ని చాపమీదకు చేర్చి తల దగ్గర దీపం పెట్టారు. షాక్ తగిలిన నేను అతని తల దగ్గర టీ గ్లాసు పెట్టి పక్కనే కూలబడ్డాను.

"మొన్న రాతిరి చలిలో నాటకానికని తీసుకెళ్లాడమ్మా ముదనష్టపోడు. వచ్చిన దగ్గరనుంచీ ఒకటే దగ్గు. ఏదో మందు బిళ్ళలు తెచ్చి యేసుకున్నాడు కూడా. పాపం గుండె నిమ్మట్టేసినట్టుంది. నిద్దట్లోనే ప్రాణం పోయుంటది. పొద్దున్నే లేవకపోయే సరికి ఆసుపత్రికి తీసుకెళ్లాము, కానీ అప్పటికే అంతా అయ్యిపోయింది. చక్కగా తిరిగే మడిసిని ఈ వయసులో నిద్రలేకుండా తిప్పి ఎంత పని చేశాడో చూడండమ్మా!" తన భర్తను దెప్పి పొడుస్తూ దీర్ఘాలు తీస్తోంది రామారావు కోడలు.

అక్కడే ఉన్న రాజేష్ ఏడుస్తూ , "ఆ రాత్రి మిమల్ని కూడా తీసుకెళ్దామని మీ ఇంటికి వచ్చాడు నాన్న కానీ మీరు ఇంట్లో లేరు. అందుకే మేమిద్దరం వెళ్ళాం. నిన్న మందుల షాపులో బిళ్ళలు కూడా తీసుకొచ్చిచ్చాను. ఇంతలోనే ఇలా జరుగుతుందని ఊహించలేదంకుల్" అన్నాడు.

మొన్న రాత్రి రామారావు నాకోసం మా ఇంటికి వచ్చాడా ? మరి నేను ఎక్కడికి వెళ్లాను? కాసేపు బాగా ఆలోచించాక గుర్తుకొచ్చింది. ఆ నాడు రాత్రి భోజనానికి కుర్చుంటుంటే ప్రక్క వీధిలో ఉండే నా మిత్రుడు పరమేశ్వరరావు వచ్చి మనసు బాలేదు మందు కొడదాం రమ్మని లాక్కెళ్ళాడు.

బాటిలు కొనుకొచ్చుకొని వాళ్ళ ఇంటి మిద్దె మీద కూర్చున్నాం చాలసేపు. అది మర్చిపోయి ఎంత సేపు నేను రామారావు నన్ను పిలవలేదనే ఆలోచనతో అతనిపై విద్వేషం పెంచుకున్నాను.

ఈ గ్రహింపు నాలో వణుకు పుట్టించింది. ఒక్కసారిగా రామారావు ఎంతో ఎత్తుకు ఎదిగిపోయి, జీవం లేని అతని మొహం కూడా ఎంతో ప్రశాంతంగా ఉండి నాలో అంతర్మథనానికి దారి తీసింది.

ఎంతో జీవితాన్ని చూసి చరమాంకంలోకి చేరుకున్నా, ఎన్నో దేశాలు తిరిగి అనుభవాన్ని గడించినా నాలోని అహంకారాన్ని మాత్రం నేను జయించలేక పోయాను. "ఆ రాత్రి ఎక్కడికెళ్ళావు?" అని ఒక్కసారి కూడా అడగని నిజమైన స్నేహితుడు రామారావు, నాలో ఇంకా మిగిలి ఉన్న కుళ్ళును ఎత్తి చూపించి తన త్రోవన తాను పోయాడు. అప్పుడే అక్కడకొచ్చిన పరమేశ్వర రావు పలకరించాడు, "ఏమైనా తిన్నావా, పరగడుపునే ఉన్నావా? వాళ్లోళ్ళందరూ వచ్చి కార్యక్రమం పూర్తయ్యే సరికి చాలా టైము పడుతుంది. ఈ వయసులో మనం అంత సేపు తట్టుకోలేము. పద.. వెళ్లి ఏమైనా ఎంగిలి పడి, ధైర్యం కోసం ఒక పెగ్గేసుకొద్దాం" అన్నాడు.

నిర్వికారంగా నవ్వి, కొడుకు తనను నాటకానికి తీసుకెళ్ళినందుకు రామారావు ఎంత సంతోషించాడో అతని కోడలికి చెప్పాలి అని ఆమె వైపు తిరిగిన నాకు నోరు తెరుచుకోలేదు. దుఃఖంతో గొంతు పూడుకు పోయిందని అనుకున్నా కానీ ఇంకా నాలో మిగిలే వున్న అహం తన ఉనికి చాటుకుంటుందని తెలుసుకొని వెక్కి వెక్కి ఏడ్చాను.

★★★

Click here to share your comments on this story